సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 45 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 29.05.2025



## కార్యకర్తలే సుప్రీం

- కోవర్టు రాజకీయాలు సహించేది లేదు
- వై.ఎస్ వివేకా హత్యలో నన్నే మోసం చేయాలని చూశారు
- మహానాడు రెండో రోజు ప్రసంగంలో చంద్రబాబు

4 లో



## అభివృద్ధి పనులు స్పీడప్ చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

3 లో

# 2 నుంచి రాజీవ్ యువవికాసం

- లబ్దిదారులకు మంజూరు లేఖలు అందించాలి
- జాబితా మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు 6 వేల 250 కోట్లతో స్వయం ఉపాధి కల్పించనున్నారని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతి యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తొడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దశల వారిగా జరిగే లబ్ధిదారుల ఎంపిక పక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండిరగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు రాష్ట్ర జి.డి.పి. లో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తల పై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య... విజ్ఞానం... ఉద్యోగం...

అధ్యాపకులే యాజమాన్యంగా కార్పోరేట్ స్థాయిలో దిగ్విజయంగా నడిపిస్తున్న...

SSV వొకేషనల్ జూనియర్ కళాశాల

శ్రీ సాయివాణి CO-EDUCATION Courses : MPHW (F), MLT, A&T

సూర్యాపేట రోడ్, HDFC లేదా Union Bank ప్రక్క గల్లీలో, 2వ వీధి కుడివైపున, జనగామ.

Cell : 9032534520, 7989084571, 9550512002, 8919314036

ఆరంభం నుండి అదే సంచలనం - ప్రతి యేటా అదే ప్రభంజనం - అది S.S.V. కే సాధ్యం...

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం S.S.V.కే సాధ్యం.

"ప్రతిభావంతులైన విద్యార్థులను విజేతలుగా నిలపడం అందరికీ సాధ్యం.... కాని ప్రతి విద్యార్థిని విజేతగా నిలపడం S.S.V. కే సాధ్యం"



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- **పంచతంత్ర థీమ్‌తో పార్క్**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో బతుకమ్మ కుంటను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ. కోటి 50 లక్షలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు బతుకమ్మ కుంటను పంచతంత్ర థీమ్ తో అభివృద్ధి చేయాలని, సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, కాలిబాట, గజిబోలు, లైటింగ్, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆట స్థలం, ఆడుకునేందుకు పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటుకు ప్రారంభించిన పనులను వేగవంతం చేసి, 15 రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే కుంట పూడికతీత పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమం లో కలెక్టర్ వెంట మున్సిపల్ డీఈ రాజ్ కుమార్, ఏఈ మహిపాల్ ఉన్నారు.




2 మన చౌరాస్తా

Mana Chourasta 29.05.2025 గురువారం


# జూన్ 4 లోగా కొనుగోళ్లన్నీ పూర్తి కావాలి

- **3 నెలల రేషన్ సరఫరా సాఫీగా జరగాలి**
- **భూ భారతి సదస్సులను పక్కాగా నిర్వహించాలి**
- **జూన్ 3 నుంచి బడిబాట**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను జిల్లా లో సజావుగా అమలు చేసేందుకు వివిధ శాఖలకు చెందిన అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ ధాన్యం సేకరణ, 3 నెలల రేషన్ సరఫరా, భూ భారతి, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంట సాగు, బడి బాట, సీజనల్ వ్యాధుల పైన సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్లోని సమావేశ హల్ లో రివ్యూ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్ లో ఎన్నడు లేని విధంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరగడం లో భాగస్వామ్యం అయిన ప్రతీ ఒక్క అధికారిని కలెక్టర్ అభినందించారు. జూన్ 4 లోగా అన్ని కేంద్రాలలో ఉన్న ధాన్యం కొనుగోలు పక్రియ పూర్తి అవ్వాలన్నారు. ఇప్పటి వరకు లక్ష 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 32,066 మంది రైతులకు రూ.335 కోట్ల నగదు జమ అయ్యిందన్నారు. సన్న వడ్లకి 5345 రైతులకు రూ.9.69 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు

## 3 నెలల రేషన్ కోటా

రాష్ట్ర ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో..3 నెలల రేషన్‌ను ఎలాంటి ఇబ్బందులు రాకుండా సాఫీగా లబ్ధిదారులకు అందించాలన్నారు. ప్రజాపాలన, మీ సేవలో దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డు వెరిఫికేషన్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వచ్చే రేషన్ కోటాలో అర్హులైన వారికి లబ్ధి చేకూరాలన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై..

ఇళ్ల నిర్మాణం ఎంత వేగంగా జరిగితే అంత తొందరగా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని, త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాలన్స్ ఉన్న గ్రామాలలో లబ్ధిదారుల ఎంపిక సంబంధించిన వెరిఫికేషన్ త్వరగా జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇస్తున్న ఇసుక గురించి ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీ రవాణా వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ ఆఫీస్ లో ఇందిరమ్మ మాడల్ ఇల్లును జూన్ 2 లోగా ఏర్పాటు చేయాలన్నారు. మండలాల్లో పెడుతున్న యూనిట్స్ వివరాల జాబితాను ఎంపీడీఓ లు ఇవ్వాలన్నారు. సిమెంట్, ఇటుక బట్టి యూనిట్ ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించాలన్నారు. జూన్ 3 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ప్రతీ గ్రామంలో భూ భారతి సదస్సులను పక్కాగా నిర్వహించాలని, దీనికి సంబంధించి యాక్షన్ ప్లాన్ ను తహసీల్దార్లు రేపటి లోగా సమర్పించాలన్నారు.

## సరపడా విత్తనాలు ఉన్నాయ్

జిల్లా లో సరిపడా విత్తనాలు, ఎరువులు ఉన్నాయని, జూన్ 5లోపు అన్ని రైతు వేదిక లలో విత్తనాల మీద రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బోర్డులు ఉన్నాయా లేదా, విత్తనాల రిజిస్టర్లు మెయింటైన్ చేస్తున్నారా లేదా అని, ఫర్టిలైజర్ షాప్ లను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి విత్తనాల కొనుగోలులో రైతులకు సహకరించాలన్నారు. జూన్ 3 నుంచి బడిబాట ప్రారంభం కావాలని, అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. వానాకాలం మొదలయిందని, ఎక్కడ సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు రాకుండా వైద్య, ఆరోగ్య , పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ అధికారులు వారి పరిధిలో అన్ని కార్యక్రమాలు జరగాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, సివిల్ సప్లై డీఎం, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్,పీడీ హౌసింగ్, జిల్లా వ్యవసాయ అధికారి, డీసీఎస్‌వో, డీఆర్డీవో, ఎస్సి కార్పొరేషన్ ఈడీ, బీసీ, ఎస్సీ, మైనారిటీ శాఖ సంక్షేమ అధికారులు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, మున్సిపల్ కమిషనర్, ఏవో కలెక్టరేట్ తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.





# యోగ మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**నల్లగొండ, మన చౌరాస్తా :** 11వ అంతర్జాతీయ యోగ మాస ఉత్సవాల సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం చిట్యాలలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. యోగ మాస ఉత్సవాలలో ప్రతి ఒక్కరు పాలుపంచుకొని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్,ఆయుష్ హోమియో డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తయ్యబా కౌసర్, పి.హెచ్.సి డాక్టర్ ఈసం వెంకటేశ్వర్లు, సిహెచ్ఓ నరసింహారావు, ఫార్మసిస్ట్ సరిత, పిఎసిఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన వెంకటరెడ్డి, యోగ ఇన్‌స్ట్రక్టర్లు కె.బజరంగ్ ప్రసాద్, వైష్ణవి, జయమ్మ, సైదమ్మ, శైలజ, గీత, రజిత, కవిత పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల ధర్నాను జయప్రదం చేయండి

**చేర్యాల, మన చౌరాస్తా :** ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30 శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. బుధవారం రోజున చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న పని ప్రదేశానికి వెళ్లి వారి ఇబ్బందులను తెలుసుకొని ఈ సందర్భంగా కొంగరి వెంకట్ మావో మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంలో పొందుపరిచిన విధంగా కాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిరుపేదలైన కూలీలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉపాధి హామీ చట్టం లోని అనేక అంశాలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారని నిధులను తగ్గించి వేస్తూ కూలీలకు సకాలంలో పని చేసిన డబ్బులు ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయ కూలీల ఈ న్యాయమైన డిమాండ్ల కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నాము. వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో మే 30 శుక్రవారం రోజున సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ఈ ధర్నాకు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మన హక్కులను సాధించుకోవాలని ప్రభుత్వం కూలీల పట్ల సానుకూలంగా స్పందించి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను నిర్వహిస్తు ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న వ్యవసాయ కూలీలందరూ ఏకమై ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గొర్రె శ్రీనివాస్, చుంచనకోట వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# స్పిరిట్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం సరైనదేనా

## సందీప్ వంగా ఎందుకింతగా రియాక్ట్ అయ్యారు

అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్ అనిపించుకున్న సందీప్ రెడ్డి వంగా అనూహ్యంగా వార్తల్లోకి వచ్చాడు. నిజానికి స్పిరిట్ సినిమా నుంచి దీపికా తప్పుకుందనే వార్త ముందు వెలుగులోకి వచ్చింది. దానికి దీపికా పెట్టిన కొన్ని కండిషన్స్ కారణమని కూడా అన్నారు. దీపికా పెట్టిన కండిషన్స్ నచ్చకపోవడంతో ఆమెను ప్రాజెక్టు నుంచి తప్పోమని కోరారని, దాంతో ఆమె వెళ్లిపోయిందని బయటకు తెలిసింది. అంతేకాదు, అనిమల్ సినిమాలో సెకండ్ హీరోయిన్ లాంటి పాత్రలో బోల్డ్ క్యారెక్టర్‌లో నటించిన తృప్తి డిమ్రి స్పిరిట్ లో హీరోయిన్ అంటూ సందీప్ రెడ్డి ప్రకటించాడు. అయితే అనూహ్యంగా ఈ వార్తలు వచ్చిన తర్వాత బాలీవుడ్‌లో స్పిరిట్ ఒక ఏ రేటెడ్ సినిమా అని, ఎక్కువగా బోల్డ్ సీన్స్, లిప్ లాక్‌లు ఉండడంతోనే దీపికా నటించలేనని బయటకు వచ్చిందని బాలీవుడ్ మీడియా పోర్టల్స్‌లో ప్రచారం మొదలైంది. దీంతో ఈ విషయం మీద ఫైర్ అవుతూ సందీప్ రెడ్డి ట్వీట్ చేశాడు. సినిమా కథ చెప్పి మిమ్మల్ని సినిమాలోకి ఆహ్వానించినప్పుడే ఒక సైన్ చేయని నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ లోకి మీరు అడుగు పెట్టినట్లే, కానీ మీరు ఒక యంగ్ యాక్టర్‌ని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఆ సినిమా కథ బయటికి చెప్తున్నారని తెలిసింది. అక్కడే మీ క్యారెక్టర్ ఏంటో బయటపడుతుంది.ఇంకా ఈ ఫేక్ ఫెమినిజం ముసుగుతో ఏం చేయాలనుకుంటు న్నారు? సరే, ఈసారి కథ మొత్తం చెప్పండి, నాకు ఏమీ ఫరక్ పడదు అంటూ ఆయన రాసుకొచ్చాడు. అయితే నిజానికి దీపికా పడుకోనే గతంలో ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్లలేదు. ఆమె పలువురు హీరోలతో డేటింగ్ చేస్తుందనే వార్తలు వచ్చినా సరే, వాటిని ఖండిరచలేదు సరికదా, తర్వాత ఒక స్టార్ హీరోని వివాహం చేసుకొని రిలేషన్‌లోకి అడుగు పెట్టింది. ఆమెను వెనకేసుకొస్తూ ఇప్పుడు బాలీవుడ్‌లో ఆర్టికల్స్ రావడంతో దాన్ని పిఆర్ స్టంట్ అంటూ సందీప్ రెడ్డి వంగాతో సహా చాలామంది అభివర్ణిస్తున్నారు.




అయితే ఇక్కడ తప్పు ఎవరిది అనే ప్రస్తావన వస్తే, ఎవరిదీ అని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చిన వారు ఎవరూ సినిమా మీద ఇలాంటి విషపు ప్రచారాలు చేయించలేదు. తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి వంగా ఇమేజ్ మరికొంత డామేజ్ అయ్యే అవకాశం ఉంటుంది






## హరిహర వీరమల్లులో అదిపోతున్న సాంగ్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకులు క్రిష్ జాగర్లమూడి అలాగే జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఎప్పుడో రావాల్సింది.. కానీ ఎన్నో ఇబ్బందులు ఎదురుకొని ఫైనల్‌గా ఈ జూన్ 12న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కాబోతుంది. ఇక విడుదల సమయం దగ్గర పడుతుండడంతో, ఒక్కో అప్ డేట్ వదులుతున్నారు మూవీ మేకర్స్. కాగా ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ కాగా, తాజాగా సినిమా నుంచి నాలుగో సాంగ్ కూడా విడుదలైంది. ఇక ఈ సాంగ్ లో నిధి లుక్ అదిరిపోయింది. లిరిక్స్ బ్యాగ్రౌండ్ స్మూత్‌గా కిక్కిచ్చేలా ఉందని చెప్పాలి. కీరవాణి మంచి ట్యూన్‌ని అందించగా శ్రీ హర్ష ఈమని ఇచ్చిన సాహిత్యం కూడా బాగుంది. ఇక ఈ సాంగ్ లో లిప్సిక భాష్యం గొంతు, బాగా ప్లస్ అయ్యిందని చెప్పాలి. అలాగే సాంగ్ లో విజువల్స్ కూడా ఒకింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాంగ్ మూడ్ కి తగ్గట్టుగా సెట్ చేసిన సెట్టింగ్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక నిధి అగర్వాల్ అయితే మెయిన్ ఎసెట్ అని చెప్పవచ్చు. తన గ్లామర్ ఇంకా తన డాన్స్ మూమెంట్స్ సాంగ్ లో చాలా బాగున్నాయి. మొత్తానికి నాలుగో పాట కూడా అదిరిపోయింది.




## మిరాయ్ టీజర్ అదుర్స్

'హనుమాన్' లాంటి భారీ హిట్ అందుకున్నా తేజ సజ్జ మళ్ళీ అదే తరహాలో 'మిరాయ్' వంటి భారీ పాన్ వరల్డ్ చిత్రంతో వస్తున్నాడు. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్న ఈ షూటింగ్‌కి, కొంచెం ఎక్కువ సమయం తీసుకుంటున్నప్పటికీ ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ అందరికీ షాకిచ్చింది. ఒక్కో పోస్టర్ మాత్రం మూవీ అంచనాలు బాగా పెంచేసింది. ఇక ఈ రోజె అవై-టె-డ్ టీ-జర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ ఊహించని రీతిలో ఉందని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉంది. ఇండియన్ సినిమా దగ్గర ఎన్నో భారీ సినిమాలు వస్తున్నాయి కానీ కంటెంట్ ఉంటే దానికి తగ్గట్టుగా కావాల్సిన ప్రామిసింగ్ విజువల్స్ కూడా చాలా మెయిన్. ఇక 'మిరాయ్' దానికి అతీతంగా ఉందని చెప్పడంలో సందేహం లేదు. స్టన్నింగ్ విజువల్ ఎఫెక్ట్స్ తో ఒక హాలీవుడ్ సినిమా చూస్తున్న ఫీల్ వచ్చింది. ముఖ్యంగా మంచు మనోజ్.. అదరకొట్టాడు. సాహస సన్నివేశాల్లో తేజ ఎక్కడా కూడా అసలు కాంప్రమైజ్ అయినట్టే కనిపించడం లేదు. అలాగే ఇండియన్ సినిమాకు ఒక సరికొత్త అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమాగా ఇవ్వబోతున్నట్లు-తెలుస్తుంది. ఇక లాస్ట్ షాట్‌లో రాముని రాకపై చూపించిన విజువల్ వర్ణనాతీతం.. మొత్తానికి 'మిరాయ్' తెలుగు ఇండస్ట్రీని మరో మెట్టు-ఎక్కించేలా కనిపిస్తుంది.




# ఎన్టీఆర్ ది అజరామర చరిత్ర

### నివాళి అర్పించిన పవన్ కళ్యాణ్

అమరావతి, మన చౌరాస్తా : దివంగత స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ చరిత్ర అజరామరం అని అన్నారు. త్రికరణ శుద్ధితో చేసే ఏ కార్యమైనా సత్ఫలాన్ని ఇస్తుందని తాను విశ్వసిస్తానని.. అటువంటి త్రికరణ



శుద్ధితో కార్యాచరణ చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని అన్నారు. మనసు, మాట, కర్మ మూడు అంశాలు సమన్వయం చేసుకొంటూ పని చేయడం ఆయనలో తాను గమనించానని, అందుకే వేషం వేసినా, రాజకీయం ఆచరించినా, ప్రజాసేవ చేసినా ఎన్టీఆర్ సత్ఫలితాలను సాధించారని కొనియాడారు. నటుడిగా, రాజకీయ నేతగా, పరిపాలనాదక్షునిగా.. చరిత్ర పుటలు నుంచి చెరిపివేయలేని చరిత్ర ఆయనదని.. ఈరోజు ఆ మహామనిషి, కళా ఋషి జయంతి సందర్భంగా ఆయనకు పుష్పాంజలి అర్పిస్తున్నానని పవన్ కళ్యాణ్ అన్నారు.





# లోకేశ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలి

### మహానాడులో ధూళిపాళ్ల, పయ్యావుల డిమాండ్



**కడప, మన చౌరాస్తా :** మంత్రి నారా లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాలంటూ డిమాండ్ ముందుకు వచ్చింది. కడపలో జరుగుతోన్న మహానాడు వేదికగా నారా లోకేష్‌కు కీలక పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర ప్రతిపాదించారు. నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని తాము మినీ మహానాడులో తీర్మానించామని సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ధూళిపాళ నరేంద్ర చెప్పారు. పార్టీలోని వారంతా కోరుకుంటున్న విధంగా నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు ధూళిపాళ నరేంద్ర విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టాలని తెలుగుదేశం పార్టీలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతుంది. అందులోభాగంగా పార్టీలోని సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితోపాటు పలువురు నేతలు ఇదే విషయాన్ని బుధవారం మహానాడు వేదికగా స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలని పార్టీ కార్యకర్తల నుంచి డిమాండ్ వస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కార్యకర్తలతో పాటు నేతలంతా ఇదే కోరుకుంటున్నారని చెప్పారు. లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలన్నది ఇప్పుడు అత్యవసరం అన్నారు. పార్టీ మరింత బలోపేతం కావాలంటే ఇది సహేతుకమైన నిర్ణయమని పేర్కొన్నారు. కడపలోని 'మహానాడు' ప్రాంగణంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్ష్యుడిగా మరోసారి సీఎం చంద్రబాబు నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. ఆ క్రమంలో నారా లోకేశ్‌ను సైతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికే నారా లోకేశ్.. ప్రజా క్షేత్రంలోనే కాదు.. మంత్రిగా కూడా సక్సెస్ అయ్యారని పార్టీ కేడర్ సైతం స్పష్టం చేస్తుంది. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ స్థానం నుంచి నారా లోకేశ్ విజయం సాధించారు. అనంతరం చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో అత్యంత కీలమైన విద్య, ఐటీ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అదీకాక.. 2023 జనవరి 27వ తేదీన నారా లోకేశ్.. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజా క్షేత్రంలో లోకేశ్ పరిణితి చెందిన నాయకుడిగా ప్రజల నుంచి మన్ననలు అందుకున్న విషయం విదితమే.



# కార్యకర్తలే సుప్రీం

- కోవర్టు రాజకీయాలు సహించేది లేదు
- వై.ఎస్ వివేకా హత్యలో నన్నే మోసం చేయాలని చూశారు
- మహానాడు రెండో రోజు ప్రసంగంలో చంద్రబాబు

**కడప, మన చౌరాస్తా :** కార్యకర్తలే నా హై కమాండ్.. వారే సుప్రీం అని టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీలో వారికే పెద్దపీట అన్నారు. టీడీపీ మహానాడులో రెండో రోజు ఆయన మాట్లాడుతూ.. మళ్లీ జన్మ ఉంటే తెలుగు గడ్డపై పుడతా అన్నారు.. కార్యకర్త నా హై కామాండ్.. కార్యకర్తే నా సుప్రీం అని స్పష్టం చేశారు.. తొలిసారిగా 65 మంది యువతకు సీట్లు ఇచ్చాం... ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచారని గుర్తుచేశారు.. లోకేష్ 6 శాసనాలు ప్రవేశ పెట్టారు.. ఆయనకు ఉన్న నాలెడ్జితో మంచి ఆలోచనలు చేస్తున్నారు.. టీడీపీ కొత్తతరహా పరిపాలనకు శ్రీకారం చుట్టింది.. ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయం తీసుకుంటున్నాం అన్నారు.. కార్యకర్తలే అధినేతలుగా మహానాడు నిర్వహిస్తున్నాం.. కొన్ని నియోజకవర్గాల్లో ఓడినా మెజార్టీ వచ్చిందని వెల్లడిరచారు.. ఇక, గుండె పోటుతో వివేకానంద రెడ్డి మృతి చెందారు... ఆ నాడు నేనుకూడా నమ్మాను.. గొడ్డలితో నరకడం వల్ల మెదడు కూడా బయటకు వచ్చినా దాచారు అంటూ వైఎస్ వివేకా హత్య కేసుపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఆ రోజు సాయంత్రానికి అనేక మలుపులు తిప్పింది ఎవరో మీకు తెలుసు... మరుసటి రోజు నారాసుర రక్త చరిత్ర అని రాశారని ఫైర్ అయ్యారు. వివేకా హత్య కేసు విషయంలో నాలాంటి నాయకుణ్నే మోసం చేయగలిగారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని ప్రచారం చేశారు.. అందరిలా నేనూ నమ్మాను. సాయంత్రానికి గొడ్డలిపోటు విషయం బయటకి వచ్చింది. నాపై నెపం వేసేందుకు దుష్ప్రచారాలు చేశారని చంద్రబాబు మండిపడ్డారు.అయితే, మన దగ్గర ఉండే కొందరు కోవర్టు రాజకీయాలు చేస్తున్నారు.. తప్పులు చేసే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. నేరస్తులు ఖబడ్దార్.. నా వద్ద మీ ఆగడాలు సాగవు.. కోవర్టులతో రాజకీయాలు చేస్తే ఉరుకోను అని వార్నింగ్ ఇచ్చారు. కోవర్టుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు సీఎం చంద్రబాబు. పార్టీలోకి



వలస పక్షులు వస్తాయ్.. పోతాయ్.. నిజమైన కార్యకర్త శాశ్వతంగా ఉంటాడని తెదేపా చంద్రబాబు అన్నారు. నేరస్థులు చేసే కనికట్టు మాయపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. కోవర్టులను పార్టీలోకి పంపాలనుకుంటే మీ ఆటలు సాగవు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై దుష్ప్రచారాలు చేస్తే సహించం. ఆడబిడ్డలపై అసభ్యంగా ప్రవర్తించే వారికి అదే చివరి రోజు అవుతుందని చంద్రబాబు అన్నారు.